# వెన్నెల కోవెల

సుదర్శనాచార్యులు మళ్ళీ ఒక మాటు అద్దంలో మొహం పరిశీలనగా చూసుకున్నాడు. త్రిపుండ్రాలు, తిరుచూర్ణం అందంగా కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నాయి. తన మొహం తనకే ఎంతో మురిపెంగా వుంది. తిరుపతి వెంకన్న వదనారవిందం, శ్రీరంగనాధుని దివ్యముఖసీమ-అందులో నెలకొని వున్నాయనిపిస్తోంది. చూసినకొద్దీ ఇంకా ఇంకా చూడాలనిపిస్తోంది. మనసులోంచి ఆనందవాహినులు పొంగులెత్తి, అన్నమయ్య కీర్తనలు పాడిస్తున్నాయి. 'మనసే కోవెలగా మారిపోయిందేమో...ఆనందమే వెన్నెలగా విరబూసిందేమో..' అన్నట్లుగా వుంది. ఆ వైష్ణవ చిహ్నాలలో అంత మహత్తు వుంది.

అద్దం అవతల పెట్టేశాడు.

ఒకమాటు ప్రాంగణ మంతా తిరిగి వచ్చాడు.

ఎంత ప్రశాంతి...

పరిసరాలన్నీ స్వామివారి సేవకోసం వినయంగా ఒదిగి ఉన్నట్లనిపిస్తోంది. ఘంటికల దివ్యనాదం నిత్యం వింటూ వింటూ తన్మయంలో పూలమొక్కలన్నీ తూలిపోతున్నాయా అన్నట్లు ఓ పక్కకి ఒరిగి వున్నాయి. పారిజాతాలు ఇంకా పరిమళిస్తూ గాలిని గౌరవిస్తున్నాయి.

తండ్రి అనంతాచార్యుల గాత్రం ఇంకా ఆ పరిసరాల్లో నిక్షిప్తమై ఉన్నట్లే లీలగా చెవులకు సోకుతోంది.

ఎన్నగ మనసుకు రాని పన్నగ శాయి సొగసు
పన్నుగ కనుగొనని కన్ను లేలే కన్నె మిన్న లేలే
మోహముతో నీలవారి వాహకాంతిని గేరిన
శ్రీహరిని గట్టుకొనని దేహమేలే ఈ గేహమేలే..

ఆ గొంతులో భక్తి రసం మకరంద వాహినుల్లా ప్రవహించేది.

కమ్మగా పాడుకుంటూ, పువ్వులు కోస్తున్న ఆ సుందర దృశ్యం మనసులో అలా శాశ్వత ముద్రగా నిలిచిపోయింది. ఆయన అటు ఇటు తిరుగుతుంటే, ఆయనతోబాటు స్వామి కూడా వెంట తిరుగుతున్నట్టు వుండేది.

కోయిల వసంతం వెళ్ళాక కనుపించదు.

జీవన వసంతం వెళ్ళాక, ఆయన కూడా స్వామి సేవకు ఊర్ధ్వలోకాలకు వెళ్ళిపోయాడు. స్వామివారి సేవలు, ఆలయ నిర్వహణ ఆనాటి నుండీ తనవంతు అయినాయి.

తండ్రి తన ప్రక్కన నిలబడి నడిపిస్తున్నట్లుగానే, ఏ లోటు రాకుండా అన్నీ సవ్యంగా చేస్తున్నాడు.

"బంటు రీతి కొలువీయవయ్య స్వామి"

మనసు మనోహరంగా పాడుతోంది.

ఆ స్వామికి బంటు కాగలిగితే అంతకన్నా మహద్భాగ్యం మరొకటి వుంటుందా?

సదా స్వామి స్మరణం చేస్తుంటే, మరణం సైతం మనముందు మోకరిల్లదా?

తండ్రి తన కైవల్యయాత్ర గురించి ముందుగానే తనకి సూచించాడు.

ఒకమాటు పరధ్యానంలో స్వామివారికి గంధం సిద్ధం చేయటం మర్చిపోయాడు. సేవ అక్కడివరకు వచ్చి ఆగిపోయింది. అప్పుడు తన పొరపాటు తెలిసింది. భయంభయంగా తండ్రి మోహంలోకి చూశాడు.

ఆయన మొహంలో ఎక్కడా ఆగ్రహం లేదు.

అటుపైన 'క్షమయా ధరిత్రి' లాంటి మందహాసం కూడా.

క్షణం నిమీలితంగా స్వామివారికి క్షమాపణ చెప్పుకుని రిక్తహస్తాలతో శ్రీగంధాన్ని భావిస్తూ స్వామివారి శరీరానికి ప్రేమగా అలదారు.

అది తన భ్రమో, దైవలీలో..కొద్ది క్షణాల వరకు ఘుమఘుమలుగా గంధసుగంధం అక్కడ తాండవించింది. పూజ ముగించాక తండ్రి ముందు తల దించుకుని, తన తప్పుకు క్షమాపణలు కోరుకున్నాడు.

"నాయనా! ఎన్ని జన్మల పుణ్యమో మనకి స్వామి సేవ దొరికింది. ఇందులో కూడా అలక్ష్యం చేస్తే మన పుణ్యం ఎలా నిలుస్తుందిరా? స్వామి నోరులేని వాడనుకోకు. ఏదీ పలుకుల్లో చెప్పడు. అలాగని అలక్ష్యాన్ని సహించడు. ఆయన సన్నిధికన్న పెన్నిధి ఏముందని పరధ్యానంలో పడుతున్నావ్? నేను శాశ్వతమా? ఇవాళ కాకపోతే పదిరోజుల తర్వాతయినా, స్వామివారి సేవలు నువ్వు చేయాల్సిందే" ఇలా సాగిపోయింది మందలింపు.

సరిగ్గా ఆనాటికి పదవరోజున ఆయన కాలం చేశాడు.

సుదర్శనాచార్యులు గట్టిగా నిట్టూర్చాడు.

ఈ ఆలయంలో స్వామితో ఇంతటి అనుబంధం వుంది. వీడలేని బంధం వుంది.

అలాంటిది...ఎక్కడో సముద్రాల కవతల...సుదూరంగా కోట్లు కుమ్మరించి కట్టించిన సరికొత్త ఆలయంలో శ్రీవారిని ప్రతిష్టించి, నిత్యసేవలు చేయటానికి ఎలా వెళ్ళగలడు?

బావ కృష్ణమాచార్యులకి ఇవన్నీ ఛాందసాలుగా కనిపించవచ్చు. అతగాడు తనకి బావే కాదు జతగాడు కూడా. అందుకే తన మీద అలివిమాలిన ప్రేమ, అంతకుమించి చనువు. ఏది చెప్పినా శాసించినట్లే వుంటుంది.

“ఒరేయ్ సుదర్శనాచార్యులూ! అమెరికా అంటే మరో స్వర్గం అనుకో. బొందితో స్వర్గానికెళ్ళినట్టే అనిపిస్తుంది. అమెరికాలో ఆలయ అర్చకుడంటే ఎంత ఘనత అనుకున్నావ్? ఇక రాబడి అంటావా? నువ్వు లక్ష్మీదేవి వళ్ళో కూర్చున్నట్లే...ఒక డాలరు అంటే మన రూపాయిల్లో సుమారు యాభై దాకా వుంటుంది. అలాంటి డాలర్ల వర్షంలో నువ్వు తడిసి తబ్బిబ్బయి పోతావ్...”

తన సంగతి ఎలా వున్నా, అతని చెల్లెలు, తనకు భార్య అయిన అలివేలు మంగ మనసంతా మురిసి, తనువంతా పులకించిపోయింది. ఊహల్లోనే వళ్ళంతా ఏడువారాల సొమ్ములు మోసింది.

“వెళదామండీ....” అంది గోముగా.

ఆ మాట తనకేదో అపశ్రుతిలా వినిపించింది.

అలివేలు సంగతి తనకి బాగా తెలుసు.

తను అనుకున్నది జరక్కపోతే అంతర్యుద్ధంలో అశాంతిని అన్నివైపులా ప్రసరిస్తుంది.

ఆ క్షణం నుండి ఈ ప్రమాదం ఎలా తప్పుతుందా అని సతమతమైపోతున్నాడు. కృష్ణమాచార్యులుకి తన నిర్ణయం తెల్లవారే చెప్పాలి. అమెరికా ప్రయాణం అంటే మాటలా? ఎన్ని ఏర్పాట్లో చూసుకోవాలి. అందుకే అతని తొందరింపు.

సుదర్శనాచార్యులు అమెరికా జీవితాన్ని ఒక మాటు ఊహించుకున్నాడు. ఆ ఊహకి ఆధారం బావ మాటలే. కళ్ళు మూసుకున్నాడు.

పాలరాతి కోవెల కనిపించింది.

ఎటు చూసినా తళతళలు..

మనుషుల సందడి...

సూట్లు, బూట్లు వేసుకున్న మనుషులు..నవ్వులు..కేరింతలు..

తను గర్భగుడి ద్వారం దగ్గర నిలబడ్డాడు.

హారతి పళ్ళెంలో డాలర్లు కురుస్తున్నాయి.

తను మంత్రాలు చదువుతూ శఠగోపం పెడుతున్నాడు. స్వామివారి పాదముద్రికలు

తాకించి, తలపులతో తల్లడిల్లే తలలకు శాంతిని, భక్తినీ ప్రసాదించడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఎవరూ స్వామివైపు చూడటం లేదు. ఎవరి గొప్పలు వాళ్ళు చెప్పుకుంటున్నారు. తను ఖిన్నుడై హారతి పళ్ళెంతో స్వామివైపు వెళ్ళాడు.

ఆశ్చర్యం...

స్వామి అక్కడ లేదు!

అక్కడంతా అంధకారం.. తను నిశ్చేష్టుడై చూస్తున్నాడు. చేతిలోంచి పళ్ళెం జారిపోయి నేలంతా డాలర్లు పరుచుకున్నాయి. తేమకి అతుక్కుపోయాయి.

తనకి కన్నీళ్ళు ఆగటం లేదు.

"ప్రసన్న వేంకటేశ్వరం భజరే
వాడి వసన్త భైరవనుతం శ్రీ
ప్రసిద్ధ తంజనగర స్థితం
ప్రబల గురుగుహ వేద్యం ఆద్యం
వశిష్ట వాసుదేవ విదితం
వర అలమేలు మంగళాశ్రితం
రసిక శేఖరం కృపాకరం
రక్షిత భక్త ఆనందకరం
ప్రసన్న వేంకటేశ్వరం.."

కళ్ళు తెరిచాడు. బుగ్గలనిండా కన్నీటి చారికలు బరువుగా తోస్తున్నాయి. లేచి, చన్నీళ్ళతో శుభ్రం చేసుకున్నాడు. స్వామి గర్భాలయంవైపు చేతులు జోడించి, వినమ్రంగా తలవంచుకున్నాడు.

◆ ◆ ◆

కృష్ణమాచార్యులు తాంబూలం సేవిస్తూ బావవైపు ఆసక్తిగా చూస్తున్నాడు. సుదర్శనాచార్యులు మాటలు రానివాడిలా మౌనంగా కూర్చున్నాడు.

"ఏమిటి బావా నీ దిగులు? ఇక్కడ ఆలయ సేవలకి నేను తగు ఏర్పాట్లు చేశాను. గోవిందాచార్యులు ఏ లోటూ లేకుండా అన్నీ సవ్యంగా చేయడానికి వప్పుకున్నాడు. అతను మనకు సన్నిహితుడే కనుక నమ్మవచ్చు.. ఇంతకీ నీ మనసులో మాట ఏమిటో చెప్పు.. అవతల అలివేలు ఎంతో వ్యాకుల పడుతోంది.."

సుదర్శనాచార్యుల అంతరంగం త్యాగరాజు కీర్తన ఆలపిస్తోంది.

"నిధి చాలా సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమో నిజముగ బల్కు మనసా" ఇక తన నిర్ణయం ధైర్యంగా చెప్పేశాడు.

"బావా! కోటి అమెరికాలు కూడా స్వామివారి కాలిగోటికి చాలవు. నాకు డబ్బు

మీద మోహం, వ్యామోహం లేవు. కావాలంటే మీ చెల్లెల్ని తీసుకెళ్ళి కొన్నాళ్ళుంచి పంపించు. నాకు నా స్వామి కావాలి. నా స్వామికి నేను కావాలి. అమెరికాలో గొప్ప ఆలయం వుంది. కానీ, అందులో ఆ పరమాత్మ ఆశీనుడు కాలేక పోతున్నాడు. పరిమళంలేని పువ్వు, భక్తి లేని పూజ వ్యర్థం. ఇక నన్ను బాధించకు..." అని లేచి వెళ్ళిపోయాడు.

కృష్ణమాచార్యులు గుటకమింగటం మర్చిపోయాడు.

000

సుదర్శనాచార్యులు ఉలిక్కిపడి లేచాడు.

ఎవరో ఏడుస్తున్నారు...ఎవరూ? అరే..కృష్ణమాచార్యులు..

"ఏమిటి బావా! ఎందుకేడుస్తున్నావ్?" ఆందోళనగా అడిగాడు.

"అయిపోయింది బావా...అంతా అయిపోయింది.." కృష్ణమాచార్యులు తల్లడిల్లిపోతున్నాడు.

"ఏమైంది?"

"ఉగ్రవాదుల విమానదాడుల్లో మా కంపెనీ బూడిదైపోయింది. ఇప్పుడు నేను అనాథలా మిగిలిపోయాను బావా!" భోరుమన్నాడు.

"పిచ్చిబావా! అలా పద.." అంటూ ఆలయప్రాంగణంలోకి నడిపించాడు. పున్నమివెన్నెల్లో కోవెల కోటిరెట్లు పవిత్రతతో ప్రశాంతతతో మెరిసిపోతోంది.

"ఇక్కడ కూర్చో..అటు చూడు స్వామి అదృశ్యంగా అనుగ్రహిస్తున్నాడు. అందుకే నిన్నిక్కడ ఉంచి రక్షించాడు..నమస్కరించుకో.."

కృష్ణమాచార్యులు జ్ఞానోదయం అయినవాడిలా చేతులు జోడించాడు. స్వామి అనుగ్రహంలా వెన్నెల రెట్టింపయ్యిది.

(జాగృతి పోటీలో బహుమతి పొందిన రచన)